GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 288 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 17.04.2025 | పేజీలు : 3

## జపాన్ చేరుకున్న రేవంత్ రెడ్డి

### -ఎయిర్ పోర్ట్ లో సాదరపూర్వక స్వాగతం

**టీ మీడియా, ఏప్రిల్ 16, హైదరాబాద్ బ్యూరో:** నారిటా – జపాన్ – ఎనిమిది రోజుల పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి జపాన్ చేరుకున్నారు. నిన్న రాత్రి హైదరాబాద్ నుంచి బయలు దేరిన బృందం ఈ రోజు మధ్యాహ్నం నారిటా ఎయిర్‌పోర్ట్ దిగారు. విమానాశ్రయంలో ఆయనకు సాదరపూర్వక స్వాగతం పలికారు అక్కడి అధికారులు..కాగా ఆయన పర్యటన ఈ నెల 22 వరకు కొనసాగనుంది. ఈ పర్యటనలో భాగంగా టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటించనున్నారు.ఆయనతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఇతర అధికారులు కూడా ఉన్నారు..ఇక ఈ పర్యటనలో ఒసాకా వరల్డ్ ఎక్స్‌పో 2025లో పెవిలియన్‌ను ప్రారంభిస్తారు. ఈ ఎక్స్‌పోలో రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, సాంకేతిక సహకారాన్ని పెంపొందించడం ప్రధాన లక్ష్యం. ఈ పర్యటన ఫలితాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ సందర్భంగా రేవంత్ బృందం వివిధ రంగాలకు చెందిన పారిశ్రామిక వేత్తలతో భేటి కానుంది.. వారికి తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలు ప్రభుత్వ పరంగా ఇస్తున్న పలు రాయితీలను వివరించనున్నారు.



## ఒడిశాలో....

# సింగరేణి గని ప్రారంభం

### -13 దశాబ్దాల చరిత్రలో నైనీ సువర్ణాధ్యాయం

### వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**టీ మీడియా, ఏప్రిల్ 16, హైదరాబాద్ బ్యూరో:** : సింగరేణి సంస్థ తన 136 సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో తొలిసారిగా ఇతర రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించుకోవడం ఒక సువర్ణ అధ్యాయమని, ఒడిశా లో నైనీ గని ప్రారంభంతో సింగరేణి తన విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మహాత్మా జ్యోతి రావ్ పూలే ప్రజా భవన్ నుంచి నేడు ఆయన ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్ ను వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగరేణి సంస్థ కే కాకుండా యావత్తు తెలంగాణ రాష్ట్రానికి ఒక గర్వకారణమన్నారు. ఈ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి కి కేటాయించి తొమ్మిది ఏళ్లు వివిధ కారణాల రీత్యా ప్రారంభానికి నోచుకోలేదని చెప్పారు.






**ప్రజాప్రభుత్వం కృషితో**

ఏడాది క్రితం ప్రజా ప్రభుత్వం కొలువు దీరిన వెంటనే ముఖ్యమంత్రి .రేవంత్ రెడ్డి, తాను కేంద్ర బొగ్గు శాఖ మంత్రిని పలుమార్లు కలిసి పూర్తి అనుమతులకు సానుకూలత సాధించామన్నారు. ప్రజా ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోగలిగామన్నారు. దీంతో ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకు సింగరేణి విస్తరణలో ఒక తొలి అడుగు గా ఆయన అభివర్ణించారు. ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలకు ఇతర దేశాలకు కూడా సింగరేణి విస్తరిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీకి, స్థానిక ఎమ్మెల్యే అగస్తీ బెహరా, ఇతర ప్రజాప్రతినిధులకు తన ధన్యవాదాలు తెలిపారు.

**అంగూల్ అభివృద్ధి కి పూర్తి కృషి**

గత ఏడాది జులైలో తాను ఒడిశా పర్యటన సందర్భంగా అంగూల్ ప్రాంత అభివృద్ధికి ఇచ్చిన ప్రతీ హామీని త్వరలోనే సింగరేణి సంస్థ అమలు జరుపుతుందని, ఆ ప్రాంత సర్వతో ముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని భట్టి అన్నారు. సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ అని, కేవలం వాణిజ్యం కోసం పనిచేసే కంపెనీ కాదని, సామాజిక స్పృహతో ఇక్కడ కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చారు.అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీ కి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాల్సిందిగా కోరారు. ఇతర రాష్ట్రంలో తొలిసారిగా బొగ్గు తవ్వకం ప్రారంభించిన సింగరేణి, ఈ గనిని ఆదర్శప్రాయంగా నిర్వహించాలని కోరారు.

**ఒడిశాలో బొగ్గు గని ప్రారంభించడం చరిత్రాత్మకం**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని, ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే అగస్తి బెహరా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ తమ ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఈ గనికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అంగూల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రంలో బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కి, సింగరేణి సీఎండీకి శుభాకాంక్షలు తెలిపారు.

**సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో**

నైనీ నుంచి ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ . బలరామ్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి చూపిన ప్రత్యేక చొరవ, సహకారం వల్ల నైనీ బొగ్గు బ్లాక్ ను ఈ రోజు ప్రారంభించుకో గలిగామన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ప్రారంభిస్తామని, మరిన్ని అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలను విజయవంతంగా చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా భవన్ నుంచి ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఓఎస్డీ సురేందర్ రెడ్డి, సింగరేణి ఈడీ(కోల్ మూమెంట్) ఎస్డి.ఎం.సుభానీ పాల్గొనగా.. నైనీ నుంచిసంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, నైనీ జీఎం టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి చరిత్రలో...

# కొత్త అధ్యాయం

### -ప్రపంచ సంస్థగా ఎదగాలని కిషన్ రెడ్డి ఆకాంక్ష




**టీ మీడియా, ఏప్రిల్ 16, హైదరాబాద్ బ్యూరో:**

సింగరేణి సంస్థ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. తొలిసారి ఇతర రాష్ట్రాల్లో తవ్వకాలు చేపట్టింది , సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్. బుధవారం(ఏప్రిల్ 16) నుంచి ఒడిశాలోని నైనీ బొగ్గు గనిలో ఉత్పత్తి ప్రారంభించింది. ఈమేరకు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. భారతదేశ ఇంధన భద్రత, ఆర్థిక వృద్ధికి ఇది గర్వకారణం అన్నారు. సింగరేణి విస్తరణ, పెరుగుతున్న సహకారాన్ని సూచిస్తుందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో కేంద్ర ప్రభుత్వం, బొగ్గు మంత్రిత్వ శాఖ తరపున, ఈ బొగ్గు బ్లాక్ నిర్వహణలో ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మొత్తం సింగరేణి కుటుంబం విజయం సాధించాలని, రాబోయే అనేక మైలురాళ్లను అధిగమించాలని కోరుకుంటున్నట్లు కిషన్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా వెల్లడించారు.ఒడిశాలోని నైనీ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు భావిస్తున్నారు. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38ఏళ్లపాటు తవ్వకాలు చేపట్టనున్నారు. ప్రస్తుతమున్న ఉపరితల గనుల్లో ఇదే అతిపెద్దది. నైనీలో అత్యంత నాణ్యమైన జీ-10 రకం బొగ్గు ఉన్నట్టు అంచనా. కాగా, తెలంగాణ కాకుండా తొలిసారి ఇతర రాష్ట్రాల్లో బొగ్గు తవ్వకాలు చేపట్టబోతోంది సింగరేణి. ు ఇప్పటివరకు తెలంగాణకే పరిమితమైన సింగరేణి.. ఇప్పుడు ఒడిశా రాష్ట్రంలో అడుగుపెడుతోంది. నైనీ బొగ్గు గనిలో తవ్వకాలను వర్చువల్‌గా ప్రారంభించారు.ఒడిశాలోని నైనీ గనిని 2016లో సింగరేణికి కేటాయించింది మోదీ ప్రభుత్వం. అన్ని అనుమతులు సాధించి తవ్వకాలు ప్రారంభించడానికి తొమ్మిదేళ్ల సుదీర్ఘకాలం పట్టింది. సింగరేణికి ఉన్న ఉపరితల గనుల్లో ఇదే అతిపెద్దది. ఇక్కడ 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. అత్యంత మేలైన జీ-10 రకం బొగ్గు ఇక్కడ ఉన్నట్టు గుర్తించింది సింగరేణి. ఏడాదికి కోటి టన్నుల చొప్పున 38ఏళ్లపాటు ఇక్కడ బొగ్గు తవ్వితీయనున్నారు. ఒడిశాలో ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాక్‌ను సింగరేణి విస్తరణలో తొలి అడుగుగా కేంద్రమంత్రి అభివర్ణించారు. సింగరేణి ఇక్కడి నుండి ఇతర రాష్ట్రాలు, దేశాలకు కూడా విస్తరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో ప్రపంచ సంస్థగా రూపాంతరం చెందుతుందని కేంద్ర మంత్రి అన్నారు.



# అడుగంటిన శ్రీశైలం

- డెడ్ స్టోరేజీకి చేరువలో నీటి నిల్వ
- గత నెలలోనే హంద్రీనీవాకు నిలిపివేత

**టీ మీడియా, ఏప్రిల్ 17,కర్నూలు** : తెలుగు రాష్ట్రాల జీవనాడి శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు అడుగంటాయి. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టిఎంసిలు కాగా ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ 38.6850 టిఎంసిలకు పడిపోయింది. జలాశయ డెడ్ స్టోరేజీ 34 టిఎంసిలు కాగా మిగిలిన 4.6850 టిఎంసిలను మాత్రమే వాడుకునేందుకు వీలుంది. ఇప్పటికే విద్యుదుత్పత్తి రూపంలో తెలంగాణ 358.94 టిఎంసిలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199.38 టిఎంసిలను కలిపి మొత్తం 558.32 టిఎంసిల నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదిలేశాయి. అవి కాకుండా పోతిరెడ్డిపాడు ద్వారా 240 టిఎంసిలను పెన్నా బేసిన్‌కు తరలించారు. హంద్రీనీవా, గాలేరు నగరి, ముచ్చుమర్రి, మల్యాల తదితర ఎత్తిపోతల పథకాలతో కలిపి ఇప్పటి వరకు శ్రీశైలం నుంచి 646 టిఎంసిల నీటిని విడుదల చేశారు. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. గత ఏడాది అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్ 215 టిఎంసిలతో కళకళలాడింది. ప్రస్తుతం వేసవి రాకముందే పరిస్థితి తారుమారవుతోంది. శ్రీశైలం జలాశయ గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా జలాశయ నీటి మట్టం 810 అడుగుల వరకు ఉంటే హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి నీటిని తీసుకోవచ్చు. అయినా అధికారులు 845 అడుగులు ఉన్నప్పుడే హంద్రీనీవా కాల్వకు నీటి సరఫరా ఆపేశారు. కర్నూలు జిల్లాలో హంద్రీనీవా ప్రధాన కాల్వ వెంట నందికొట్కూరు నుంచి పత్తికొండ వరకు రైతులు రబీలో పంటలు వేశారు. నీటిని ఆపేయడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో వేరుశనగ, మిరప, కూరగాయల సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం జిల్లా కసాపురం నుంచి జీడిపల్లి వరకు 20 వేల ఎకరాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఇరు రాష్ట్రాలు విద్యుద్పత్తి పేరిట పోటీపడి దిగువకు నీటి విడుదల చేస్తుండడంపై పర్యావరణవేత్తలు, సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లమల అభయారణ్యంలో వన్యప్రాణుల మనుగడకు అవసరమైన మేరకు జలాశయంలో నిల్వలు ఉండేలా చూడాలంటున్నారు.

**తుంగభద్రలోనూ తగ్గిన నీటి నిల్వ**

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు నీటిని అందించే తుంగభద్ర జలాశయంలోనూ వేసవి రాకముందే నీటి నిల్వలు తగ్గుతున్నాయి. తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105.473 టిఎంసిలు కాగా ప్రస్తుతం 7.11 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. జలాశయ గరిష్ట నీటి మట్టం 1633 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 1584.67 అడుగులకు చేరింది. గతేడాది ఆగస్టు 11న తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ ప్రమాదవశాత్తు కొట్టుకుపోయింది. దాంతో దాదాపు 40 టిఎంసిల వరకు నీరు వృథాగా పోయింది.



## కుటుంబ సమేతంగా సీఎం చంద్రబాబు విదేశీ పర్యటన

**టీ మీడియా, ఏప్రిల్ 16, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి చేరుకుం టారు. అక్కడినుంచి విదేశీ పర్యటనకు వెళ్తారు.
చంద్రబాబుతోపాటు ఆయన సతీమణి భువనే శ్వరి, లోకేశ్ దంపతులు వెళు తున్నారు. ఈ పర్యటనలోనే ఈనెల 20న చంద్రబాబు 75వ పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకోనున్నారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబంతో కలిసి విదేశీ పర్యటనలో ఉండనున్నారు. ఏటా ఒకసారి కుటుంబంతో కలిసి కొంత సమయం విదేశాల్లో గడిపే ఆనవాయి తీ పాటిస్తూ వస్తున్నారు సీఎం చంద్రబాబు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబం ఏప్రిల్ 17వ తేదీ ఉదయం ఒంటి గంటకు ఢిల్లీ అంతర్జాతీయ విమా నాశ్రయం నుంచి విదేశా లకు బయలుదేరనున్నారు. ఆయన సతీమణి భువనేశ్వరి, కుమారుడు నారా లోకేష్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ విదేశాలకు వెళ్తున్నారు. విదేశీ పర్యటనను ముగిం చుకుని తిరిగి ఏప్రిల్ 21వ తేదీ అర్ధరాత్రి అమరావతికి చేరుకుంటారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బిఆర్ గవాయ్

### -సిఫార్సు చేసిన కొలీజియం



**టీ మీడియా, ఏప్రిల్ 16, ఢిల్లీ:** భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా తన వారసుడిగా జస్టిస్ బిఆర్ గవాయి పేరును అధికారికంగా సిఫార్సు చేశారు. ఆయన పేరును కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపారు. దీంతో, జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ భారతదేశ 52వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. సాంప్రదాయకంగా, ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి తన వారసుడి పేరును న్యాయ మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేస్తారు. ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా పదవీకాలం మే 13తో ముగియనుంది. సీనియారిటీ జాబితాలో సీజేఐ ఖన్నా తర్వాత జస్టిస్ గవాయ్ పేరు ఉంది. అందుకే జస్టిస్ ఖన్నా తన పేరును ప్రతిపాదించారు. అయితే, ఆయన పదవీకాలం 7 నెలలు మాత్రమే ఉంటుంది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లోని ఆయన ప్రొఫైల్ ప్రకారం, జస్టిస్ గవాయ్ మే 24, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఆయన పదవీ విరమణ తేదీ నవంబర్ 23, 2025. కాగా, సీనియారిటీ జాబితాలో జస్టిస్ గవాయ్ తర్వాత జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఆయనను 53వ ప్రధాన న్యాయమూర్తిగా నియమించే అవకాశం ఉంది.జస్టిస్ గవాయ్ 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించారు. 1985లో ఆయన తన న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. 1987లో బాంబే హైకోర్టులో స్వతంత్ర ప్రాక్టీసు ప్రారంభించారు. అంతకుముందు ఆయన మాజీ అడ్వకేట్ జనరల్, హైకోర్టు న్యాయమూర్తి దివంగత రాజా ఎస్ భోసలేతో కలిసి పనిచేశారు. 1987 నుండి 1990 వరకు బాంబే హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. ఆగస్టు 1992 నుండి జూలై 1993 వరకు బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్‌లో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న, ఆయన బాంబే హైకోర్టు శాశ్వత న్యాయమూర్తి అయ్యారు.జస్టిస్ గవాయ్ దేశంలో రెండవ దళిత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవుతారు. అంతకుముందు, జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ భారత ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. జస్టిస్ బాలకృష్ణన్ 2007 సంవత్సరంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, జస్టిస్ గవాయ్ అనేక మైలురాయి తీర్పులలో పాల్గొన్నారు. వాటిలో మోదీ ప్రభుత్వం 2016లో తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయాన్ని సమర్థించడంతోపాటు ఎన్నికల బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించడం జరిగింది.

## గద్దర్ తెలంగాణ ఫిలిం అవార్డ్స్

### -జ్యూరీ చైర్మన్ గా సినీ నటి జయసుధ



**టీ మీడియా, ఏప్రిల్ 16, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహి స్తున్న గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ కోసం జ్యూరీ చైర్మన్ సినీనటి జయసుధ ను నియమించారు. ఆమె అధ్యక్షతన జ్యూరీ సమావేశం జరిగింది.ఈ అవార్డుల కోసం వ్యక్తి గత క్యాటగిరీలో 1172 నామినేషన్లు, చలన చిత్రాలు, డాక్యుమెంటరీలు, పుస్తకాలు తదితర క్యాట గిరీలలో 76 నామినేషన్లు స్వీకరించబడ్డాయి. మొత్తం 1248 నామినే షన్లతో ఈ అవార్డులకు భారీ స్పందన లభించినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నుంచి జ్యూరీ సభ్యులు నామినేషన్ల స్క్రీనింగ్ ప్రక్రియను ప్రారంభించను న్నారు. ఈ సందర్భంగా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డిసి) చైర్మన్ మరియు ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, జ్యూరీ సభ్యులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నామినే షన్లను పరిశీలించాలని కోరారు.తెలుగు చలనచిత్ర రంగానికి జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చే విధంగా జ్యూరీ సభ్యులు వ్యవహ రించాలి. ఈ అవార్డుల కోసం ప్రభుత్వం నిష్ణాతు లైన వారిని జ్యూరీ సభ్యులుగా నియమించింది, అని ఆయన అన్నారు.దిల్ రాజు మాట్లాడుతూ, 14 ఏండ్ల విరామం తర్వాత తెలంగాణ ప్రభుత్వం చలన చిత్ర అవార్డులను నిర్వహి స్తుండటం విశేషమని తెలిపారు.ఉమ్మడి రాష్ట్రంలో కూడా చలన చిత్ర అవార్డులకు ఇంతటి స్పందన రాలేదు. ఈసారి భారీ స్థాయిలో నామినే షన్లు రావడం సినీ రంగానికి గర్వకారణం అన్నారు.గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ తెలుగు సినిమా రంగంలోని ప్రతిభను గుర్తించి, సత్కరించే లక్ష్యంతో నిర్వహించబడు తున్నాయి. ఈ అవార్డులు చలన చిత్ర నిర్మాణంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభను వెలికితీసేందుకు ఒక వేదికగా నిలుస్తాయని ఆశిస్తున్నారు.

## రాజీవ్ యువ వికాసం

# గేమ్ ఛేంజర్

3లో..

- సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దు
- బ్యాంకర్లతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం

